జనాభా

అభివృద్ధి-అల్పాదాయ దేశాలు

ప్రపంచ జనాభాలో మూడో వంతు జనాభా అభివృద్ధి చెందుతోన్న దేశాల్లోనే నివసిస్తోంది. ఈ దేశాలను వెనుకబడిన లేదా మూడో ప్రపంచదేశాలని పిలుస్తారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పశ్చిమ యూరోప్, ఉత్తర అమెరికాతో పాటు ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్‌ను మొదటి ప్రపంచ దేశాలుగా పరిగణిస్తాం. కమ్యూనిస్ట్ దేశాలను రెండో ప్రపంచ దేశాలుగా భావిస్తాం. ఇవి ప్రస్తుతం మార్కెట్ ఆర్థిక వ్యవస్థలుగా రూపాంతరం చెందుతున్నాయి. సామ్యవాద వ్యవస్థ లేని అభివృద్ధి చెందుతున్న దేశాలు మూడో ప్రపంచ దేశాలు. ఈ కోవలో లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలు, ఆఫ్రికా, మధ్య తూర్పు దేశాలు, జపాన్ మినహా మిగతా దేశాలన్నీ చేరుతాయి. ఆదాయ స్థాయిని బట్టి ప్రపంచబ్యాంక్ అభివృద్ధి చెందుతున్న దేశాలను అల్పాదాయ, మధ్య ఆదాయ దేశాలుగా వర్గీకరించింది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలను మార్కెట్ ఆర్థికవ్యవస్థలుగా వర్గీకరించింది. మార్కెట్ రహిత వ్యవస్థ లేదా కేంద్రీకృత ప్రణాళికా వ్యవస్థలుగా సామ్యవాద ఆర్థిక వ్యవస్థలను బ్యాంకు వర్ణించింది. ప్రపంచ బ్యాంకు ప్రత్యేకంగా పెట్రోలియం ఎగుమతి దేశాలైన ఓమన్, లిబియా, సౌదీ అరేబియా, కువైట్‌ను వర్గీకరించింది. ఈ దేశాల్లో ఆదాయస్థాయి హెచ్చుగా ఉండి పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న దేశాలకు భిన్నంగా, సాంప్రదాయ వ్యవస్థలుగా ఉంటాయి. వివిధ సమాజాలు తమ ఉత్పత్తి, ఆదాయాలను రెండు విధాలుగా పెంచుకుంటాయి. అవి భూమి, శ్రమ, మూలధనం లాంటి ఉత్పాదకాలను పెంచుకోవడం లేదా ఈ ఉత్పాదకాల ఉత్పాదకతను పెంచుకోవడం.

వాస్తవిక ఉత్పత్తి, ఆదాయాన్ని నిర్ణయించే కారకాలు

ఎ)**పనిచేయగలిగే గంటల సంఖ్య:** 1.పనిచేసే జనాభా వయస్సు 2.శ్రామిక శక్తి భాగస్వామ్యం 3. ఒక వారంలో పనిచేసే గంటల సంఖ్య(కనీసం 40 గంటలు)లపై ఆధారపడి ఉంటుంది.

బి) **శ్రామిక ఉత్పాదకత:** 1.సాంకేతిక పరిజ్ఞానం 2.మూలధన రాశి 3.విద్య, శిక్షణలపై ఆధారపడి ఉంటుంది.

వెనుకబడిన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందిన, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశంగా పరివర్తన చెందే క్రమంలో 5 దశలను రోస్టో అనే ఆర్థిక వేత్త వివరించారు.

- **సాంప్రదాయ సమాజం:** ఈ సమాజంలో వ్యవసాయ రంగం ప్రధాన పాత్ర వహిస్తుంది. ఇక్కడ సాంకేతిక పరిజ్ఞానం తక్కువ.
- **వృద్ధికి నిబంధనలు:** సాంప్రదాయ సమాజంలో మార్పు ప్రారంభమవుతుంది. వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుంది. వ్యవసాయ రంగంలో మిగులు మూలధన వస్తువుల్లో పెట్టుబడులకు దారితీస్తుంది.
- **టేకాఫ్:** ఈ కాలంలో ఉత్పాదక సామర్థ్యం పెరిగినందువల్ల పొదుపు రేటు ఎక్కువగా ఉంటుంది.
- **మెచ్యూరిటీ:** పారిశ్రామికీకరణ వేగవంతమైనందువల్ల ఉత్పత్తి, ఆదాయ స్థాయిలు పెరుగుతాయి.
- **అధిక వినియోగదశ:** ఈ దశలో సేవారంగం ప్రధాన పాత్ర వహిస్తుంది. వినియోగవస్తువులను అధిక మొత్తంలో సమాజం వినియోగించుకుంటుంది.

ఇటీవలి కాలంలో కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు మంచి ప్రగతి సాధించాయి. మార్పు సాధ్యమని వాటి అనుభవాలు తెలుపుతున్నాయి.

- అనేక వెనుకబడిన దేశాలు మధ్య ఆదాయ దేశాలుగా రూపాంతరం చెందాయి. వాటిని కొత్తగా పారిశ్రామికీకరణ చెందిన దేశాలుగా పిలుస్తాం. ఉదా: దక్షిణ కొరియా, తైవాన్, సింగపూర్, హాంకాంగ్
- కొన్ని వెనుకబడిన ఆర్థిక వ్యవస్థలు హరిత విప్లవం కారణంగా ఆర్థిక ప్రగతిని సాధించాయి. వ్యవసాయరంగంలో ఉత్పత్తి పద్ధతులను మెరుగుపర్చడం వల్ల భారత్ ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించింది.
- ఆయుః ప్రమాణంలో పెరుగుదల, శిశుమరణాల రేటు తగ్గుదల కొన్ని దేశాల్లో కనిపిస్తోంది. కానీ కెన్యా, ఇతర ఆఫ్రికా దేశాల్లో జనాభా విస్ఫోటనం సంభవించింది.

అల్పాభివృద్ధి దేశాలు-లక్షణాలు

తలసరి ఆదాయం తక్కువగా ఉండి ఎక్కువ మంది జనాభా పేదరికంలో ఉండటం అల్పాభివృద్ధి దేశాల ముఖ్య లక్షణం. కానీ ఈ దేశాల్లో ప్రజల జీవన ప్రమాణం, తలసరి ఆదాయంలో పెరుగుదలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

- **వ్యవసాయరంగంపై అధికంగా ఆధారపడటం:** ఈ దేశాల్లో వ్యవసాయ రంగం ప్రధాన పాత్ర వహిస్తుంది. అభివృద్ధి చెందిన దేశాల స్థూల జాతీయోత్పత్తిలో ఈ రంగం వాటా 5 శాతం లోపే ఉంటుంది. అనేక అల్పాభివృద్ధి దేశాల జీడీపీల్లో వ్యవసాయ రంగ వాటా 40 శాతం వరకు ఉంటుంది. అల్పాదాయ దేశాల్లో 70 శాతం శ్రామిక శక్తి వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడుతోంది. మైనింగ్, తయారీ, సేవారంగాలు వృద్ధి చెందకపోవడమే శ్రామికశక్తి అధికంగా వ్యవసాయరంగంపై ఆధారపడటానికి కారణం. మిగతా రంగాలతో పోల్చినప్పుడు ఉత్పాదకత విలువ కూడా వ్యవసాయ రంగంలో తక్కువే. కమతాల సగటు పరిమాణం అమెరికాలాంటి దేశాలతో పోల్చినప్పుడు వెనుకబడిన దేశాల్లో తక్కువ. ఒక ఎకరంలో పనిచేసే జనాభా కూడా ఈ దేశాల్లో ఎక్కువ. శ్రామిక ఉత్పాదకత తక్కువ.
- వ్యవసాయరంగంలో తక్కువ ఉత్పాదకతతో పాటు శ్రామిక-భూమి నిష్పత్తి ఎక్కువగా ఉండటం, విక్రయం కాగల మిగులు వెనుకబడిన

దేశాల్లో తక్కువ. వ్యవసాయరంగంపై అధిక జనాభా ఆధారపడటం కమతాలు ముక్కలుగా విడిపోవడానికి కారణం. భూసంస్కరణలు సక్రమంగా అమలు కాకపోవడం కూడా ఆయా దేశాల్లో వ్యవసాయ ఉత్పాదకత తగ్గడానికి కారణమైంది.

- జనాభావృద్ధి రేటు అధికంగా ఉండటంతో పాటు మరణాల రేటు తగ్గడం జనాభా విస్ఫోటనానికి కారణం అయింది. అనేక వెనుకబడిన దేశాలు మాల్థస్ జనాభా పరిణామ సిద్ధాంతం రెండో దశలో ఉన్నాయి.
- ఈ దేశాల్లో కన్పించే ముఖ్యలక్షణం పొదుపు రేటు, మూలధన కల్పన తక్కువ. ప్రజల ఆదాయాలు తక్కువగా ఉండటానికి ఆర్థిక కార్యకలాపాలు తక్కువగా ఉండటమే కారణం. ఆదాయాలు తక్కువైనందువల్ల పొదుపు రేటు తగ్గి మూలధన కల్పన తగ్గుతోంది. లక్షిత వృద్ధిరేటు సాధించాలంటే ఆయా దేశాల్లో మూలధన కల్పన ఎక్కువగా ఉండాలి.
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, పేదరికం ఎక్కువ. ఆయా దేశాల్లో పేదరికాన్ని నిరపేక్ష పేదరికంగా భావిస్తాం. శ్రామిక శక్తి వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడటం వల్ల ప్రచ్ఛన్న, రుతు సంబంధమైన నిరుద్యోగం కన్పిస్తుంది. పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధిరేటు తక్కువైనందువల్ల ఈ దేశాల్లో పెరుగుతున్న జనాభా తమ జీవనోపాధికోసం వ్యవసాయ రంగంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు.
- ఈ దేశాల్లో విద్య, ఆరోగ్య రంగాలపై స్వల్ప పెట్టుబడుల వల్ల మానవాభివృద్ధి కొరవడింది. మానవాభివృద్ధి తక్కువైనందువల్ల కొరతగా ఉన్న సహజ, మూలధన వనరులను సక్రమంగా వినియోగించుకోనందువల్ల ఆర్థికాభివృద్ధి మందగించింది.
- ఈ దేశాలు ప్రధానంగా ప్రాథమిక ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాలు. తయారీ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటాయి. ప్రాథమిక ఉత్పత్తుల విలువ తక్కువగా ఉన్నందువల్ల ఆయా దేశాల విదేశీ వాణిజ్య లోటు పెరిగింది. ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న పోటీని ఈ దేశాలు తట్టుకోలేకపోతున్నాయి.
- వెనుకబడిన దేశాల్లో గ్రామీణ, పట్టణ రంగాల్లో వ్యత్యాసాలు ఎక్కువ. ఈ వైవిధ్యాన్ని 'ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ'గా భావిస్తాం. వనరుల ఉత్పాదకత ముఖ్యంగా మానవ వనరుల నాణ్యత గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ. పట్టణ ప్రాంతాల్లో ఆధునిక తయారీ ఉత్పత్తి పద్ధతులు ఉపయోగిస్తారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో అక్షరాస్యత రేటు కూడా ఎక్కువ.
- ఈ దేశాల్లో ఆదాయ పంపిణీలో అసమానతలు ఎక్కువ. ఇటీవల కాలంలో ఈ దేశాల్లో తలసరి ఆదాయాలు పెరిగినప్పటికీ ఆర్థిక వృద్ధి వల్ల సమాజంలో కొన్ని వర్గాల ప్రజలే లబ్ధి పొందారు. అందువల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికం పెరిగింది.
- వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సాంకేతిక ప్రగతి తక్కువ
- వయోజన జనాభాలో అక్షరాస్యత తక్కువ
- ముడిసరకులు, మాధ్యమిక వస్తువుల ఎగుమతులపై ఈ దేశాలు ఎక్కువగా ఆధారపడ్డాయి.

ముఖ్యాంశాలు:

- **పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలను మార్కెట్ ఆర్థిక వ్యవస్థలుగా ప్రపంచ బ్యాంకు వర్గీకరించింది.**
- **పశ్చిమ యూరోప్, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్‌లను మొదటి ప్రపంచ దేశాలుగా పరిగణిస్తాం.**
- **ఉత్పాదక సామర్థ్యం పెరిగి పొదుపు రేటు ఎక్కువగా ఉన్న దశ** Take-off
- **అమెరికా డాలర్లలో లెక్కించిన తలసరి జాతీయాదాయ దీర్ఘకాల పెరుగుదలను ఆర్థికాభివృద్ధిగా భావిస్తారని జి. మేయర్ అభివర్ణించారు.**
- **ఆర్థిక వ్యవస్థ, పూర్తి సాంఘిక వ్యవస్థ కింది స్థాయి నుంచి పై స్థాయికి కదలడాన్ని ఆర్థికాభివృద్ధిగా భావించవచ్చని గున్నార్ మిర్డల్ పేర్కొన్నారు.**
- **ఆర్థికవృద్ధి జాతీయోత్పత్తిలో పరిమాణాత్మక మార్పునే తెల్పుతుంది.**
- **ఆర్థిక వ్యవస్థలో జాతీయాదాయ పెరుగుదలతో పాటు వ్యవస్థాపూర్వక, సాంకేతిక మార్పులతో కూడిన గుణాత్మక మార్పును 'ఆర్థికాభివృద్ధి' అంటారు.**
- **అభివృద్ధిని సూచించే కారకాల్లో 'వాస్తవ స్థూల జాతీయోత్పత్తి' ముఖ్యమైంది.**
- **ఆర్థికాభివృద్ధికి సూచికగా 'వాస్తవిక తలసరి ఆదాయం'ను లూయిన్, మేయర్, హెబర్లర్‌లు భావించారు.**
- **భౌతిక జీవన ప్రమాణ సూచీని తయారుచేసింది మోరిస్.**
- **మానవాభివృద్ధి సూచీని 'ఐక్యరాజ్యసమితి అభివృద్ధి వ్యవస్థ' 1990లో రూపొందించింది.**
- **ఆర్థికాభివృద్ధికి సంబంధించి 41 చలాంకాలను తీసుకొని ఆడల్మన్, సింథియా మోరిస్‌లు అధ్యయనం చేశారు.**
- **శ్రామిక ఉత్పాదకతను నిర్ణయించే అంశాలు.. సాంకేతిక పరిజ్ఞానం, మూలధన రాశి, విద్య, శిక్షణ.**